నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, సోమవారం 25 నవంబర్ 2024 | PEDDAPALLI

ముఖ్యమంత్రికి జ్ఞానోదయం కలిగించాలి

గంగాధర, నవంబర్ 24: పెండింగ్ బిల్లులు ఇచ్చేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జ్ఞానోదయం కలిగించాలని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు మధురానగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆత్మహత్య చేసుకున్న కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని, తెచ్చిన డబ్బులకు వడ్డీ పెరిగిపోతున్నదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ తాజా మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం, మాజీ సర్పంచులు మడ్లపెల్లి గంగాధర్, మేచినేని నవీన్‌రావు, వేముల దామోదర్, వేముల అంజి, ఎండీ నజీర్, ముక్కెర మల్లేశం, పాశం కుమార్, పంజాల ఆంజనేయులు, వడ్లూరి ఆది మల్లు ఉన్నారు.


మధురానగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచులు

అటకెక్కిన డిజిటల్ లిట్రసీ



- ప్రభుత్వ బడుల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటుకు గత సర్కారు నిర్ణయం
- జగిత్యాల జిల్లాలో 93 పాఠశాలకు గతేడాది నవంబర్‌లో 465 కంప్యూటర్లు అందజేత
- ప్రస్తుత సర్కారు నిర్లక్ష్యంతో నీరుగారిన పాలసీ లక్ష్యం
- ఏడాదిగా డబ్బాల్లోనే కునుకుతీస్తున్న కంప్యూటర్లు
- ఇంత వరకు జరగని ఇన్‌స్టాలేషన్, ప్రోగ్రామింగ్
- నిర్లక్ష్యం వీడకపోతే సిస్టమ్స్ పూర్తిగా చెడిపోయే ప్రమాదం

ప్రభుత్వ పాఠశాలలపై సర్కారు చిన్నచూపు చూస్తున్నది. ప్రాథమిక విద్యను పూర్తిగా గాలికొదిలేసింది. సర్కారు బడి పిల్లల్లో డిజిటల్ లిట్రసీని పెంచడం, స్మార్ట్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటే లక్ష్యంగా గత సర్కారు గతేడాది నవంబర్‌లో జగిత్యాల జిల్లాలోని 93 అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లకు 465, ఎమ్మార్సీ సెంటర్లకు 75 కంప్యూటర్లు పంపించగా, ఆ తర్వాత నెల రోజులకే ప్రభుత్వం మారడంతో పాలసీ అటకెక్కింది. ఒక్కో విద్యాలయానికి ఐదేసి కంప్యూటర్లు అందించగా, అవి ఎందుకు వచ్చాయో..? వాటిని ఎలా వినియోగించాలో..? అసలు వాటిని ఎక్కడ పెట్టాలో తెలియని దుస్థితిలో విద్యాశాఖ పనిచేస్తోంది. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకుండా డబ్బాల్లో మగ్గుతుండగా, పట్టని ఉన్నతాధికారుల తీరు విమర్శలకు తావిస్తున్నది.

జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ పాఠశాలలో బాక్స్‌లోనే ఉన్న కంప్యూటర్లు

జగిత్యాల, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): భవిష్యత్తు మొత్తం డిజిటల్ రంగానిదే. ప్రపంచం కాదు, విశ్వమే ఒక కుగ్రామంగా మారిపోయి, మనిషి అరచేతిలోనే విశ్వమంతా అమరిపోయే పరిస్థితి ఏర్పడుతున్నది. ఇలాంటి కాలంలో రాష్ట్రంలోని చిన్నారులను సాంకేతికరంగ నిపుణులుగా తీర్చిదిద్ది, వారిని డిజిటల్ ప్రపంచంలో ఒక భాగం చేయాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పించారు. అందుకు అనుగుణంగానే ప్రభుత్వ పనితీరు సాగింది. రాష్ట్రాన్ని కంప్యూటర్ రంగానికి కేంద్ర బిందువుగా మార్చేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టిన విషయం తెలిసిందే. కంప్యూటర్ రంగాన్ని అభివృద్ధి చేయడంతోపాటు కంప్యూటర్‌ను గ్రామీణ ప్రాంత ప్రజలు, విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు అనేక చర్యలు చేపట్టారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలను డిజిటల్ పాఠశాలగా, డిజిటల్ తరగతి గదిగా మార్చేందుకు సంకల్పించారు. ప్రతి పాఠశాలలో స్మార్ట్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ బోధనను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే ప్రతి ప్రభుత్వ పాఠశాలకు తెలంగాణ ఫైబర్‌నెట్ ద్వారా వైఫై సౌకర్యం కల్పించి, డిజిటల్ లిట్రసీ (సాంకేతిక అక్షరాస్యత)ని పెంచాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే 2023లో రాష్ట్రవ్యాప్తంగా 1902 ప్రభుత్వ పాఠశాలలు, 493 ఎంఆర్‌సీలు, 10 డైట్ కేంద్రాల్లో ఐసీటీ ల్యాబ్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కంప్యూటర్లను మంజూరు చేశారు. ఒక్కో పాఠశాలకు, డైట్ కేంద్రానికి, మండల రిసోర్స్ కేంద్రానికి రూ.2.40లక్షలు కేటాయించారు.

93 పాఠశాలలకు చేరిన కంప్యూటర్లు..

సమగ్ర శిక్ష పథకంలో భాగంగా మైక్రోకేర్ కంప్యూటర్స్ కంపెనీ వారు జగిత్యాల జిల్లాలోని పాఠశాలలకు గతేడాది నవంబర్‌లో కంప్యూటర్లను పంపిణీ చేశారు. ఒక్కో స్కూల్‌కు ఐదేసి చొప్పున చేరుకున్నాయి. జిల్లాలో అప్పర్ ప్రైమరీ, హైస్కూల్స్ మొత్తం 93 స్కూళ్లకు 465 కంప్యూటర్లు చేరాయి. పది మండల రిసోర్స్ సెంటర్లకు ఐదేసి చొప్పున 75 వచ్చాయి. మొత్తంగా 540 కంప్యూటర్లు విద్యా సంస్థలకు చేరాయి. నిబంధనల ప్రకారం పరిశీలిస్తే ప్రభుత్వం నుంచి ఆర్డర్ పొందిన కంప్యూటర్ సప్లై సంస్థ ప్రింటర్స్, కంప్యూటర్ ఇన్‌స్టాలేషన్, ప్రోగ్రామింగ్, ఐదేండ్ల పాటు మెయింటనెన్స్ నిర్వహించాలి. కంప్యూటర్లతో విద్యార్థులకు స్మార్ట్ తరగతి గదులను రూపొందించి, పిల్లల డిజిటల్ లిట్రసీ రేటును పెంచాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ పాఠశాలలోని ప్రతి విద్యార్థి కంప్యూటర్‌పై అవగాహన పెంచుకోవడంతో పాటు, ప్రత్యక్షంగా తర్ఫీదు పొందడం, ప్రోగామింగ్, డిజిటల్ అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఇక డైట్ కాలేజీలతో పాటు, మండల రిసోర్స్ కేంద్రాలకు ఇచ్చిన కంప్యూటర్లతో విద్యాశాఖ నిర్దేశించిన లక్ష్యాలు, రికార్డులన్నింటినీ కంప్యూటరైజ్డ్ చేయించి స్మార్ట్ పరిపాలన వ్యవస్థను సృష్టించాలని భావించింది.

నిరుపయోగంగా కంప్యూటర్లు.. ఇన్‌స్టాలేషన్ ఏది..?

జిల్లా వ్యాప్తంగా గతేడాది నవంబర్‌లో 93 పాఠశాలలకు చేరిన కంప్యూటర్లన్నీ నిరుపయోగంగా పడి ఉన్నాయి. 90 శాతం పాఠశాలల్లో కంప్యూటర్లను కనీసం అట్టబాక్స్‌ల నుంచి బయటకి సైతం తీయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కంప్యూటర్లతోపాటు ప్రింటర్లు రావాల్సి ఉండగా, ఇప్పటికీ రానే లేదు. ఇక నిబంధనల ప్రకారం కంప్యూటర్లలో ప్రోగ్రామింగ్ చేసి, ఇన్‌స్టాలేషన్ చేయాల్సిన బాధ్యత సైతం కంప్యూటర్లు పంపిణీ చేసిన మైక్రోకేర్ సంస్థదే. అయితే ఇంత వరకు ఆ కంపెనీ ప్రతినిధులు పాఠశాలలకు వచ్చి కంప్యూటర్లను ఇన్‌స్టాలేషన్ చేయనేలేదు. కంప్యూటర్లను అమర్చేందుకు టేబుల్స్ రానేలేదు. అన్నింటి కంటే ముఖ్యంగా కంప్యూటర్లు, స్మార్ట్ తరగతుల నిర్వహణ, డిజిటల్ బోధన, పిల్లలకు శిక్షణకు కావాల్సిన వైఫై సౌకర్యం ఏర్పాటు చేయలేదు.

ఎందుకిచ్చారు..? ఏం చేయాలి..?

జిల్లాలోని 93 పాఠశాలలకు ఏడాది క్రితం ఐదేసి కంప్యూటర్లు ఎందుకు ఇచ్చారో తమకు తెలియడం లేదని, ఏ పద్ధతిలో వాటిని వాడుకోవాలో..? వాటికి సంబంధించిన నియమ నిబంధనలు ఏంటో సైతం తెలియదని, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పేర్కొంటుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. సరఫరాదారు కంప్యూటర్లను ఇన్‌స్టాల్ చేయలేదని, అలాగే ప్రింటర్స్‌ను సైతం తమకు అప్పగించలేదని, ప్రోగ్రామింగ్, ఇన్‌స్టాలేషన్ లేకపోవడం, టేబుల్స్ సైతం పంపిణీ చేయకపోవడంతో కంప్యూటర్లను బాక్స్‌లోంచి బయటకు తీసే ప్రయత్నం చేయలేదని చెబుతున్నారు. కాగా, ఇదే విషయమై విద్యాశాఖ అధికారులను ప్రశ్నించగా, పాఠశాలలకు కంప్యూటర్లు ఎందుకు వచ్చాయో తమకు తెలియదని సమాధానం చెబుతున్నారు. వాటిని ఎందుకోసం పంపిణీ చేశారు..? ఎలా వినియోగించాలి..? వాటి కరికుల్యలం ఏంటీ..? అన్న విషయం తమకు తెలియదని, ఎలాంటి ఉత్తర్వులు రాలేదని చెబుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే అంటున్న ఉపాధ్యాయులు

ఏడాది క్రితం పంపిణీ చేసిన కంప్యూటర్లు నిరుపయోగంగా పడి ఉండేందుకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని పలువురు ప్రభుత్వ టీచర్లు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వం పిల్లల్లో డిజిటల్ లిట్రసీని పెంచేందుకు కంప్యూటర్లు, ప్రింటర్‌ను మంజూరు చేసింది. ఐదు కంప్యూటర్లు, ప్రింటర్, మెయింటెయినెన్స్ కోసం ప్రతి యూనిట్‌కు రూ.2.40లక్షలు ఖర్చు చేసింది. కంప్యూటర్ల పంపిణీ జరిగిన నెల రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం మారిపోయింది. కొత్తగా వచ్చిన ప్రభుత్వం డిజిటల్ లిట్రసీపై దృష్టిపెట్టాల్సి ఉండగా, దానిపై శీతకన్ను వేసిందని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన కంప్యూటర్లను ఇప్పటికైనా ఇన్‌స్టాలేషన్ చేయించి, ప్రోగ్రామింగ్ ఏర్పాటు చేసి, పాఠశాలలకు వైఫై సౌకర్యంతో పాటు, కంప్యూటర్లను అమర్చుకునేందుకు టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంత పిల్లలకు ప్రయోజనం చేకూరుతుందని, లేకుంటే పరిస్థితి ఇలాగే కొనసాగితే పంపిణీ అయిన కంప్యూటర్లు పూర్తిగా చెడిపోతాయని పేర్కొంటున్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, నాయకులు

'కాళేశ్వరం'పై కావాలనే అపవాదు

- ఆ ప్రాజెక్టే ఇప్పుడు కాంగ్రెస్‌కు దీపం
- కాళేశ్వరం నుంచి హైదరాబాద్‌కు 20 టీఎంసీల కోసం సీఎం టెండర్లు ఎలా పిలవమన్నరు?
- దళితబంధు నిధులపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- హుజూరాబాద్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలకు హాజరు

హుజూరాబాద్/హుజూరాబాద్ టౌన్, నవంబర్ 24 : బీఆర్ఎస్ హయాంలో కట్టిన కాళేశ్వరంతో రాష్ట్రవ్యాప్తంగా పంట పొలాలు సస్యశ్యామలమయ్యాయని, వాటిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపవాదు వేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. కూలిపోయిందని చెప్పిన కాళేశ్వరం ప్రాజెక్టే కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు దీపం అయిందన్నారు. ప్రాజెక్టు కూలిపోతే అక్కడి నుంచే హైదరాబాద్ ప్రజల మంచినీటి అవసరాల కోసం 20 టీఎంసీలు తరలించేందుకు వెంటనే టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి ఎలా చెప్పారని ప్రశ్నించారు. ఆదివారం హుజూరాబాద్ నియోజకవర్గంలో జరిగిన పలు శుభకార్యాలకు హాజరైన ఆయన, పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక వైపు ముఖ్యమంత్రి కాళేశ్వరం ప్రాజెక్టు కూలింది అంటుంటే.. మరోవైపు వారి మంత్రులే గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయని, ఇంకో మంత్రి కాళేశ్వరం నుంచి లక్ష ఎకరాలకు నీళ్లు అందిస్తామని ఎలా చెప్పారో? తెలపాలని ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం కావాలనే అపవాదు వేశారని ప్రజలందరికీ అర్థమైందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నీళ్ల కోసం ఎన్నో ఆలోచనలు చేసి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి, లక్షల ఎకరాలకు నీళ్లు అందించారని, తెలంగాణ రా ష్ట్రం ఏర్పడిన నాటికి కేవలం 30 లక్షల మెట్రిక్ ట న్నుల పంట పండితే కేసీఆర్ పాలనలో 10 ఏళ్లలో కోటి 54 లక్షల మెట్రిక్ టన్నుల పంట పండిందని వివరించారు. స్వయంగా దేశ ప్రధాని లోక్‌సభలోనే నీళ్ల విషయంలో కేసీఆర్‌ను పొగిడారని గుర్తు చేశారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

ఫ్రీజింగ్ ఎత్తివేసి దళిత బంధు రెండో విడుత నిధులను వెంటనే విడుదల చేసి దళితులను ఆదుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హుజూరాబాద్ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా దళిత బంధు పథకం ప్రారంభించి, 18,500 కుటుంబాలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత బంధు అందించారని గుర్తు చేశారు. దళితబంధు కోసం హుజూరాబాద్‌లో ధర్నాకు దిగిన దళిత కుటుంబాలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో దళితులకు అండగా ఉంటూ వారి సమస్యలపై నిలదీస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అఫ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ హుజూరాబాద్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం

- జగిత్యాల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు
- అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇంత ప్రజా వ్యతిరేకత మూట గట్టుకున్న ప్రభుత్వం ఎక్కడా లేదు
- పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ మారిన ఎమ్మెల్యే సంజయ్‌ను ప్రజలు క్షమించరు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- హైదరాబాద్‌లో జగిత్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో సమావేశం

జగిత్యాల నియోజకవర్గ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని, గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగరవేసేందుకు కృషి చేద్దామని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో జగిత్యాల నియోజకవర్గ నాయకులతో ఆదివారం సమావేశమయ్యారు. నియోజకవర్గ నాయకులకు దిశా నిర్దేశం చేయడంతో పాటు, జగిత్యాలతో తనకు ఉన్న అనుబంధం, జగిత్యాల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలు, ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపు తదితర అంశాలను ప్రస్తావించారు.

జగిత్యాలతో నాది ఆత్మీయ బంధం

జగిత్యాలతో తనకు ఆత్మీయ బంధం ఉన్నదని కవిత చెప్పారు. 2014లో నిజామాబాద్ ఎంపీగా తాను గెలవడం, జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ కుమార్ ఓడిపోవడం, పార్టీలకతీతంగా వచ్చిన తెలంగాణను అభివృద్ధి చేసుకోవాలని తపించడం, తదితర అంశాలు కండ్లముందు ఉన్నాయన్నారు. జగిత్యాలలో అప్పుడు ప్రతిపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నా, అభివృద్ధిలో జగిత్యాల వెనుకబడొద్దన్న కేసీఆర్ ఆదేశాలను ఆమె గుర్తుకు తెచ్చుకున్నారు. కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టిన ప్రతి కార్యక్రమం ప్రజలకు ఎంతగానో మేలు చేసిందన్నారు. చిన్న జిల్లాల ద్వారానే ఎక్కువ అభివృద్ధి జరుగుతుందని, గ్రామాల్లో ఉన్న ప్రతి పేద వ్యక్తికి కూడా తెలంగాణ సాధించిన ఫలితం అందుతుందని కేసీఆర్ తెలంగాణ ఉద్యమం రోజుల్లోనే చెప్పేవారని, ఆ పద్ధతిలోనే జగిత్యాల జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. హైదరాబాద్ తర్వాత ఎక్కువ సంఖ్యలో 4,500 డబుల్ బెడ్ రూం ఇండ్లు జగిత్యాలకే కేటాయించి ప్రత్యేక శ్రద్ధ చూపెట్టారన్నారు.

నాయకులు పార్టీ మారినా, కార్యకర్తలు పార్టీతోనే..

పార్టీ మారిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, 2014లో ఎమ్మెల్యే కాకపోయినా పార్టీ ప్రతి కార్యక్రమంలో వేదిక పైకి తీసుకొచ్చి, కాబోయే ఎమ్మెల్యే అంటూ ఐదేండ్ల పాటు ప్రతి గ్రామంలో చెప్పిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2014లో ఎమ్మెల్యేగా ఉన్న జీవన్‌రెడ్డి ఎన్ని ఆకృత్యాలు, ఆఘాయిత్యాలు చేసినా, బీఆర్ఎస్ కార్యకర్తలంతా ముందుండి కొట్లాడడం వల్లే, జగిత్యాలలో గులాబీ జెండా ఎగిరిందన్నారు. నాయకులు పార్టీలు మారి నా, కార్యకర్తలు పార్టీలోనే ఉంటారని చెప్పడానికి మంచి ఉదాహరణ జగిత్యాల నియోజకవర్గమని స్పష్టం చేశారు. ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీకి మా రిపోయినప్పుడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్తే అర్థముండేదని, కానీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా గోడ మీద పిల్లిలాగా ఉండడం తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడం లాంటిదని ఎమ్మె ల్సీ కవిత ఫైర్ అయ్యారు. అలాంటి ఎమ్మెల్యేను ప్రజలు క్షమించరన్నారు. దేశ చరిత్రలో అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇంత ప్రజా వ్యతిరేకత మూట గట్టుకున్న ప్రభుత్వం ఎక్కడా లేదని కవిత విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఏ ఒక్క పనిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంకా ప్రారంభించలేదని విమర్శించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం..

ప్రతి గ్రామంలో వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా సిద్ధం చేసుకోవాలని, కేసీఆర్ హయాంలో ఎలా ఉంది..? ప్రస్తుతం ఎలా ఉంది..? అనే అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు. కరెంటు కోతలు, రైతు భరోసా, మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వకుండా ఎలా మోసం చేశారనే అంశాలను ఇప్పటి నుంచే చెప్పాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలను తీసుకొని, స్థానిక సంస్థల ఎన్నికల్లో జగిత్యాలలో మెజారిటీ సీట్లు గెలిచేలా ప్రణాళికలు సిద్ధం చేద్దామన్నారు. కాగా ఈ సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గెలుపు కోసం, ఆయన మేలు తపించిన బిడ్డ కష్టాల్లో ఉండి, జైల్లో ఉన్నప్పుడు అధికారం కోసం పార్టీ ఫిరాయించి, జగిత్యాల ఎమ్మెల్యే రాజకీయాలకు మచ్చ తెచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ నాయకులు దావ సురేశ్, లోక బాపురెడ్డి, తురగ శ్రీధర్‌రెడ్డి, కొలుముల రమణ, శీలం ప్రవీణ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

జ్యువెల్లర్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల

వర్ష జ్యువెల్లర్స్ ప్రారంభం

కరీంనగర్ విద్యానగర్, నవంబర్ 24 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టవర్‌సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వర్ష జ్యువెల్లర్స్ గోల్డ్ అండ్ సిల్వర్ షాప్‌ను ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్ సింగ్, మేయర్ వై సునీల్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, ఆరెపల్లి మోహన్, నాయకులు చల్ల హరిశంకర్, నిర్వాహకులు ఎలగందుల వీరేశం, పెద్ది వేణుగోపాల్, బొడ్ల రాజు, వారి కుటుంబసభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీకి నాలుగు అవార్డులు

జ్యోతినగర్, నవంబర్ 24: రామగుండం ఎన్టీపీసీకి నాలుగు అపెక్స్ ఇండియా అవార్డులు లభించాయి. టెక్నాలజీ ఎక్స్‌లెన్స్‌లో విభాగంలో ప్లాటినం, హెచ్ఆర్ ఎక్స్‌లెన్స్‌లో గోల్డ్, ట్రైనింగ్ ఎక్స్‌లెన్స్‌లో గోల్డ్, థర్మల్ పవర్ సెక్టార్ కేటగిరీ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీలో గోల్డ్ అవార్డులు లభించాయి. కాగా, శనివారం గోవాలో జరిగిన అపెక్స్ ఇండియా ఫౌండేషన్ 9వ హెచ్ఆర్ అండ్ సేఫ్టీ, ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఎన్టీపీసీ అధికారులు ఫౌండేషన్ ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

గన్నీ బ్యాగ్స్.. క్వాలిటీలెస్!

- అక్కడక్కడా నాణ్యతలేని సంచులు
- గడ్డి, ఇతర ప్యాచ్‌లు వేస్తూ తూకం వేస్తున్న హమాలీలు
- మార్గం మధ్యలో చిరిగిపోయి ధాన్యం రోడ్డుపాలు
- ఒక్క శంకరపట్నంలోనే రెండుసార్ల ఇబ్బంది పడ్డ రైతులు

..పక్క చిత్రంలో కనిపిస్తున్న మహిళా రైతు శంకరపట్నం మండలం కన్నాపూర్‌కు చెందిన మేకల రజిత. ఇటీవల తన గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేయించి ట్రాక్టర్‌లో శంకరపట్నం సమీపంలోని మిల్లుకు తరలిస్తుండగా, గన్నీ బ్యాగులు చిరిగి రోడ్లపై పడిపోయాయి. సుమారు ఐదారు క్వింటాళ్ల ధాన్యం రోడ్డుపాలైంది. తిరిగి ఆ వడ్లను సంచుల్లోకి ఎత్తేందుకు పడిన కష్టాలు వర్ణనాతీతం. రోడ్డుపై వెళ్లే వాహనాల కింద పడి చాలా ధాన్యం నలిగిపోయింది. నాసిరకం, కాలం చెల్లిన గన్నీ బ్యాగుల కారణంగా ఈ దుస్థితి వచ్చిందని ఆ మహిళా రైతు వాపోయింది. రెండు రోజుల క్రితం కూడా ఇదే మండలానికి చెందిన మరో రైతుకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. కొనుగోళ్లు పుంజుకుంటున్న ప్రస్తుత తరుణంలో నాణ్యమైన గన్నీ బ్యాగులు ఇవ్వాలనే డిమాండ్ రైతుల నుంచి వస్తున్నది.

చిరిగిన గన్నీ బ్యాగులను చూపుతున్న కన్నాపూర్‌కు చెందిన మహిళా రైతు రజిత

కరీంనగర్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. అయితే, కొన్ని చోట్ల గన్నీ బ్యాగుల విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొనుగోళ్లపై అధికారుల అంచనాలు మారిన తర్వాత కరీంనగర్ జిల్లాకు 55 లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా, 62 లక్షలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అవసరానికి మించి అందుబాటులో ఉన్నా ఇచ్చిన వాటిలో కాలం చెల్లినవి కూడా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. అయితే, ప్రతి సీజన్‌లో 54 శాతం కొత్తవి, 46 శాతం పాతవి వాడుతుంటారు. మిల్లర్ల వద్ద ఉన్న గన్నీని కూడా రిపేర్లు చేయించి తీసుకుంటారు. ఇవన్నీ పోను కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని అంచనా వేసి గన్నీ బ్యాగుల అవసరం మేరకు సమకూర్చుకుంటారు. అధికారుల వద్ద ఉన్నవి, రైస్ మిల్లర్లు ఇచ్చేవి 46 శాతం మాత్రమే పాత గన్నీ బ్యాగులు ఉండాలి. ప్రతి సీజన్‌కు 54 శాతం కొత్త బ్యాగులు టెండర్ల ద్వారా సమకూర్చుకోవాలి. కానీ, ఈ సీజన్‌లో ఏ కొనుగోలు కేంద్రంలో చూసినా పాత బ్యాగులే కనిపిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గన్నీ బ్యాగులకు ఎలాంటి కొరత లేకున్నా ఉన్నవాటిలో చాలా మట్టుకు కాలం చెల్లినవి, నాసిరకం ఉన్నట్టు తెలుస్తున్నది. ఇలాంటి వాటితో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నుంచి గన్నీ బ్యాగులు తీసుకెళ్లిన కొందరు రైతులకు చీకిపోయినవి వస్తున్నాయి. ఇవి బాగా లేవని రైతులు అభ్యంతరం తెలిపినా కొత్తవి ఇవ్వడం లేదు. నాణ్యత లేదని వాపస్ చేస్తే.. తిరిగి ఇవ్వాలంటే నాలుగైదు రోజులు పడుతున్నది. ధాన్యం త్వరగా కేంద్రాలకు తరలించి, విక్రయించుకోవాలని చూసే రైతులు కాలం చెల్లిన బ్యాగుల్లోనే ధాన్యం నింపుకొని కేంద్రాలకు తెచ్చుకుంటున్నారు. అవి అక్కడి వరకు వస్తే గండం గడిచినట్టు భావిస్తున్నారు. కొందరు రైతులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. మార్గం మధ్యలో ట్రాక్టర్లు కుదుపునకు గురి కావడంతో ధాన్యం బస్తాలు చిరిగి పోతున్నాయి. ఇటీవల శంకరపట్నం మండలంలోనే ఇద్దరు రైతులకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. గన్నీ బ్యాగుల్లో రైతులు ధాన్యం నింపుకొని తెస్తుండగా మార్గం మధ్యలో చిరిగిపోయి విలువైన ధాన్యం రోడ్డు పాలైంది. రైతులు అష్టకష్టాలు పడి తిరిగి ఆ వడ్లను ఇతర బస్తాల్లో నింపుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లారు. కొందరు రైతులు తమ ధాన్యాన్ని కేంద్రాల్లో తూకం వేసుకుని సొంత ట్రాక్టర్లలో మిల్లులకు తరలించుకుంటున్నారు. ఇ లాంటి రైతులు కూడా కాలం చెల్లిన గన్నీ బ్యాగుల తో అష్ట కష్టాలు పడుతున్నారు. నాలుగైదు సీజన్లలో వాడిన గన్నీ బ్యాగులనే తిరిగి ఇస్తున్నారని, కొందరు మిల్లర్లు రిపేర్లు చేయకుండానే ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ కారణంగానే బ్యాగులు చిరిగిపోయి ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని వాపోతున్నారు.

రోడ్డుపై పడిపోయిన ధాన్యం బస్తాలు

నాణ్యమైన గన్నీ బ్యాగులే ఇస్తున్నాం

కరీంనగర్ జిల్లాలో ఎక్కడా గన్నీ బ్యాగుల కొరత లేదు. రైతులకు, కేంద్రాలకు నాణ్యమైన గన్నీనే సరఫరా చేస్తున్నాం. ఎక్కడో చోట ఒకటి అరా చిరిగి పోయిందని నాసిరకం గన్నీ ఇస్తున్నామని అనడం సరికాదు. కొనుగోళ్లు మును పెన్నడూ లేని విధంగా సజావుగా జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం 54 శాతం కొత్త గన్నీ బ్యాగులు తెప్పించాం. ఒక్క శంకరపట్నం మండలంలో మినహాయిస్తే ఎక్కడ ఇలాంటి ఫిర్యాదులు రాలేదు. అది కూడా ఒక్క సెంటర్ నుంచే వచ్చింది. రైతులు గన్నీ బ్యాగులు తీసుకునేటప్పుడే బాగున్నాయో లేదా చూసుకోవాలి. బాగున్న బ్యాగులనే తీసుకెళ్లాలి. చిరిగి పోయినవి ఉంటే పక్కన పడేయాలి. మనకు అవసరానికి మించి గన్నీ బ్యాగులు నిల్వ ఉన్నాయి.

- రజినీకాంత్, డీఎం సివిల్ సప్లయ్స్ (కరీంనగర్)